నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
28 మే 2026

# అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి





**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**నవగీతం, మే27,జగిత్యాల ప్రతినిధి :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం, నిల్వ, రవాణా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్ డేటా ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లో త్వరితగతిన నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిల్లులకు తరలించిన ధాన్యాన్ని 24 గంటల్లోపు అన్‌లోడింగ్ చేసేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, నిల్వ ప్రక్రియలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.పరిశీలనలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహరావు, డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన





**నవగీతం, మే27,(జగిత్యాల ప్రతినిధి)** జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో చలిగల్‌లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం కోసం ప్రతిపాదిత స్థలాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పాఠశాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలతో పాఠశాల నిర్మాణాన్ని సమగ్ర ప్రణాళికతో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.పాఠశాల భవనాలతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఆట స్థలాలు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.స్థల పరిశీలన కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీం, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత**



**నవగీతం, మే27, జగిత్యాల ప్రతినిధి :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్ పనులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను నిరీక్షణ లేకుండా పంపించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు, ఇతర డాక్యుమెంటేషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటిస్తూ రైతులకు సరైన సమాచారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్, డీటీ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఇబ్బంది అండగా నిలిచిన సర్పంచ్ మామిడి రాజు

**నవగీతం, మే 27(ఇల్లంతకుంట, ప్రతినిధి)** మండల కేంద్రానికి చెందిన కీర్తి భారతి అనారోగ్యంతో మృతిచెందగా సొంత ఇల్లు లేకపోవడంతో కుటుంబ సభ్యులు అంతక్రియల నిర్వహణ విషయంలో ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మామిడి రాజు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. అద్దె ఇల్లు కావడంతో, వర్షం పడుతుండడంతో మృతురాలు కుటుంబ సభ్యులు పడుతున్న ఇబ్బందిని గమనించి సర్పంచ్ యువజన సంఘాల అధ్యక్షుడు రేగుల కార్తీక్, నాయకులతో మాట్లాడి పార్థివ దేహాన్ని యువజన సంఘాల భవనంలో ఉంచడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి రాజు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలు, క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు గ్రామస్తులు యువజన సంఘాల భవనాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సమయంలో సేవ చేయడమే తన బాధ్యత అని సర్పంచ్ మామిడి రాజు అన్నారు. యువజన సంఘాలు, సర్పంచ్ అందిం చిన సహకారానికి మేరా నాయకులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్ ఏం రాజు, యువజన సంఘాల అధ్యక్షుడు రేగుల కార్తీక్, సభ్యులకు, ఉపసర్పంచ్ మూగు నాగరాజు శర్మ, వార్డు సభ్యులు చేరాల



వంశీ, అంతటి శ్రీకాంత్, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అందరి ఒకటిగా ముందుకు రావడం గ్రామ ఐక్యతకు నిదర్శనమై అన్నారు. పదవి అంటే అధికారం కాదు బాధ్యత అని సర్పంచ్ నిరూపించారని అని అన్నారు.

## విద్యుత్ సమస్యపై స్పందించిన వార్డు కౌన్సిలర్

హర్షం వ్యక్తం చేసిన వార్డు ప్రజలు



**నవగీతం,మే27 కోరుట్ల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు ఉమర్ మస్జిద్ సమీపంలో నిన్న రాత్రి వీచిన ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై 4వ వార్డు కౌన్సిలర్ తెడ్డు శ్రీజ విజయ్ కుమార్ వెంటనే స్పందించి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కౌన్సిలర్ విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది మరియు మున్సిపల్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగి, శ్రమించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి సకాలంలో స్పందించి, అంకితభావంతో పనిచేసిన విద్యుత్ మరియు మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి 4వ వార్డు కౌన్సిలర్ తెడ్డు శ్రీజ విజయ్ కుమార్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రేచపల్లిలో ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

**రైస్ మిల్, గోదాం నిర్మాణాలు**

**చేపట్టాలని తహసీల్దార్‌కు సర్పంచ్ వినతి**



**నవగీతం, మే27,జగిత్యాల ప్రతినిధి:** సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బృహత్ పల్లె ప్రకృతి వనం కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని కబ్జా కాకుండా పరిరక్షించాలని కోరుతూ రేచపల్లి గ్రామ సర్పంచ్ బాస మహేష్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్ 556లో సుమారు ఐదు ఎకరాల భూమిని గతంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో గ్రామపంచాయతీకి ప్రకృతి వనం అభివృద్ధి కోసం అప్పగించినట్లు ఆయన తెలిపారు. అయితే ప్రస్తుతం అదే భూమిలో రైస్ మిల్ మరియు గోదాం నిర్మాణ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ భూమిని కాపాడి, గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని తహసీల్దార్‌ను కోరారు. అలాగే ఆ భూమిని రేచపల్లి గ్రామ మహిళా సమాఖ్య సంఘాలకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్‌కు సమర్పించిన వినతిపత్రం జీరాక్స్ ప్రతిని సారంగాపూర్ మండల సమాఖ్య ఏపీఎం చంద్రకళ ఆధ్వర్యంలో రేచపల్లి గ్రామ సమాఖ్య మహిళా సంఘ సభ్యులకు సర్పంచ్ బాస మహేష్ అందజేశారు.

## మక్కల కొనుగోలు త్వరగా పూర్తి చేయాలి



**నవగీతం,మే27, (రాయికల్ ప్రతినిధి):**రాయికల్ యువజన మార్కెట్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి తొందరగా మక్కలను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. రైతులతో మాట్లాడినా ఎమ్మెల్యే మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తుందని మొత్తం మక్కాలను కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని మొత్తం మక్కాలను కొనుగోలు చేస్తామని అన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ,మండల నాయకులు అధికారులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి -- అదనపు కలెక్టర్ బి.ఎస్ లత



**నవగీతం, మే27,జగిత్యాల ప్రతినిధి :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతంగా పూర్తి చేసి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు.బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు చల్‌గల్ గ్రామంలోని ఏఎంసీ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.కేంద్రాల్లో హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు తదితర డాక్యుమెంటేషన్ పనులను సకాలంలో పూర్తి చేసి ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు సరైన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించిన ఆమె, తేమ శాతం మరియు నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్, డీటీ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

